ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య

- సొంత భూమి ఉన్నవారే అర్హులు
- సంక్షేమ పథకాల అమలుకు ఇదే ప్రామాణికం
- ప్రారంభమైన ప్రక్రియ



నెల్లిబండ రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ యూనిక్ ఐడీపై రైతులకు వివరిస్తున్న ఏడీఏ విజయమోహన్

దేవనకొండ: ఆధార్ తరహాలో అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగు భూమి ఉన్న ప్రతి రైతుకు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య పత్రం జారీ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. భవిష్యత్‌లో వివిధ సంక్షేమ పథకాల అమలుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుంది. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. మండలంలో వేరుశనగ, పత్తి, మిర్చి, శనగ, మినుము, పొగాకు, మొక్కజొన్నతో పాటు కూరగాయల పంటల్లో గోరుచిక్కుడు, చిక్కుడు, టమాట, వంకాయ, బెండ, కాకరతో పాటు ఉద్యాన పంటల్లో మామిడి, చీనీ, జామ, సపోట, టెంకాయ పంటలు సాగవుతాయి. ఖరీఫ్ సాగు విస్తీర్ణం 76,800 ఎకరాలు, రబీలో 8వేల విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తారు. మండలంలో మొత్తం రైతులు 26 వేల మంది ఉన్నారు. వీరంతా విశిష్ట సంఖ్యకు నమోదు చేయించుకోవాల్సి ఉంది. సొంత పొలం ఉన్న రైతులంతా అధికారులు సూచించిన ధ్రువ పత్రాలతో స్థానిక రైతు సహాయ కేంద్రాల్లో సంప్రదిస్తే నమోదు చేసుకుంటారు.

నమోదుకు అవసరమైన ధ్రువ పత్రాలు..

- రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం జిరాక్స్, లేదా వన్‌బీ, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్.
- రైతుకు మూడుసార్లు ఓటీపీలు వస్తాయి. ఆ ఓటీలను వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి రైతు విశిష్ట గుర్తింపు ప్రక్రియ దరఖాస్తును పూర్తి చేయాలి.

ప్రయోజనాలు..

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పని చేస్తుంది. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటలబీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలను నేరుగా పొందే వీలు కలుగుతుంది.

- సత్వర పరిహారం పొందేందుకు ఉపయోగ పడుతుందన్నారు. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి తోడ్పడుతుంది.

ప్రతిరైతు నమోదు చేయించుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు నమోదు చేసుకొని విశిష్ట నంబర్ పొందాలి. ప్రభుత్వాలు రైతులకు అందించే పథకాలను ఈ ఐడీ ద్వారా రైతులు పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ జరుగుతోంది.

– సురేష్‌బాబు, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

హైవే- 167 నిర్మాణం పూర్తి చేయాలి

ఆలూరు రూరల్: పట్టణంలో హైవే-167 నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు, దుకాణాల యజమానులు గురువారం రోడ్డెక్కారు. రెండేళ్ల నుంచి అసంపూర్తిగా ఉన్న హైవే 167తో దుమ్ము, ధూళితో అనారోగ్యాల బారిన పడుతున్నామని వాపోయారు. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. ఇళ్లల్లో దుమ్ము చేరుతుండడంతో తలుపులు తెరుచుకోలేకపోతున్నామన్నారు. దుకాణాల్లోకి సరుకులు ధూళికి దెబ్బతింటున్నాయని వ్యాపారాలు చేయలేకపోతున్నారు. గత ఏడాది ధర్నా చేపట్టగా..మరో నెల రోజుల్లో పూర్తి చేస్తామని నాడు అధికారులు హామీ ఇచ్చి.. ఏడాది అవుతున్నా హైవే నిర్మాణం పూర్తి చేయడం లేదని మండిపడ్డారు. నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ అనంతరం కేదారేశ్వరస్వామిని తాకిన సూర్యుడి కిరణాలు

వెల్దుర్తి: స్థానిక జర్నలిస్టు కాలనీలో శ్రీవేంకటేశ్వర, అయ్యప్ప, సాయిబాబ ఆలయ సమూహంలో కేదారేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ప్రతిష్ఠోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠానంతరం సూర్యదేవుని కిరణాలు స్వామి మూలవిరాట్టుపై పడడంతో తిలకించిన భక్తులు పులకించి పోయారు.

భక్తి శ్రద్ధలతో షబ్ ఏ బరాత్



వెల్దుర్తి జామియా మసీదులో మత బోధన చేస్తున్న తాజుద్దీన్ హఫీజ్ సాబ్

వెల్దుర్తి: రంజాన్ నెల ముందు వచ్చే షాబాన్ నెల 15వ రోజు ముస్లిములు శుభప్రదంగా జరుపుకునే షబ్ ఏ బరాత్ (పెద్దరాత్రి)ను గురువారం మండలంలోని ముస్లిములు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బడాదిన్, బడీరాత్‌గా రెండ్రోజులు ఉపవాస దీక్షలు నిర్వహించారు. బడీరాత్‌ను పురస్కరించుకుని గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు అన్ని మసీదులు, ఇళ్లలో ప్రత్యేక నమాజులు చేపట్టారు. ఖబరస్తాన్‌కు వెళ్లి ప్రత్యేక దుఆ చేశారు.


అడవులను కాపాడుకుందాం



మాట్లాడుతున్న డీఆర్‌ఓ విజయ్‌కుమార్

వెల్దుర్తి: అడవులను కాపాడుకుంటే పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణ, ప్రకృతి సమతుల్యత సాధమవుతుందని కర్నూలు డీఆర్‌ఓ విజయకుమార్, డిప్యూటీ ఆర్‌ఓ ఓబులేసు తెలిపారు. అడవులు, అటవీ జంతువుల సంరక్షణపై గురువారం రామళ్లకోట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల నుంచి గ్రామ నడిబొడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు.

కూలీల సమస్యలు పట్టని పాలకులు



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు, ఉపాధి కూలీలు

పత్తికొండ రూరల్ : ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 12న చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పత్తికొండలోని షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అధ్యక్షతన గ్రామాల్లో వలసలు అరికట్టాలి–ఉపాధి హామీ పనులు కల్పించాలని ఉపాధి కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ఏటా బడ్జెట్‌లో కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో బకాయిలు జమ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లపై దాడులు, అరాచకాలు పెట్రేగిపోతున్నాయని విమర్శించారు. అనంతరం సభ ప్రాంగణం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సూపరింటెండెంట్ బాబుకు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, సహాయ కార్యదర్శి పెద్దహుల్తి సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

పత్తికొండ రూరల్ : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దారు రమేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బి.సురేంద్ర మాట్లాడుతూ కంది పంట దిగుబడులు కొనుగోలు చేస్తామని పుచ్చకాయలమాడ గ్రామంలో జనవరి 28న డీసీఎస్ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన కందుల కొనుగోలు కేంద్రం రెండు రోజులకే మూతబడిందన్నారు. దీంతో ప్రభుత్వ చేతగానితనం బట్టబయలైందన్నారు. కంది రైతులు అధికారుల చుట్టూ తిరుగుతుంటే సమాధానం చెప్పలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డివిజన్ కేంద్రమైన పత్తికొండలో కంది కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని, లేదంటే మూతబడిన కొనుగోలు కేంద్రాన్ని పునఃప్రారంభించాలని కోరారు. గురుదాస్, పెద్దమునిస్వామి, సిద్దేశ్వర, ఏఐటీయుసి రంగన్న, రైతు సంఘం నాగిరెడ్డి పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలు నిషేధం



హత్తిబెళగల్ కొండలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఆలూరు రూరల్: భూగర్భ, గనుల శాఖ అధికారుల అనుమతులు లేనిదే తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలింపు నిషేధించడమైందని మండల రెవెన్యూ అధికారులు హత్తిబెళగల్, అగ్రహారం కొండల్లో గురువారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కొన్ని నెలలుగా మండలంలోని హత్తిబెళగల్,అగ్రహారం కొండ సర్వే నంబర్ 915బిలో 16 ఎకరాలు, 969 సర్వే నంబర్‌లో 662 ఎకరాల విస్తీర్ణం, సర్వే నంబర్ 557లో 105.04, 1568 సర్వే నంబరులో 9.30 ఎకరాల విస్తీర్ణంలో కొందరు త్వకాలు జరిపి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆ శాఖ అధికారుకు ఫిర్యాదుల అందాయి. ఇందులో భాగంగానే తహసీల్దార్ గోవింద్ సింగ్ ఆదేశాల మేరకు గురువారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బసవన్న గౌడ్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆదేశాలు ధిక్కరించి గ్రావెల్ తరలిస్తే లారీలు,ట్రాక్టర్లు సీజ్ చేసి వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

సంక్షిప్తం

అధికారులకు పదోన్నతులు

మద్దికెర : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలువురికి పదోన్నతులు లభించినట్లు తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ గురువారం తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ రామదాసుకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, బసినేపల్లి వీఆర్వో శివన్న సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు పొందారని ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని చెప్పారు.

ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కృష్ణగిరి: భూమి ఉన్న ప్రతి రైతు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని అమకతాడు, కంబాలపాడు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం పరిశీలించారు. రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే 14 అంకెలు ఉన్న ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుందన్నారు. ఈ విశిష్ట సంఖ్య ఉన్న రైతులకు మాత్రమే ప్రభుత్వ రాయితీలు అందుతాయని చెప్పారు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు

ఆలూరు : స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అశ్వర్థ నారాయణ, నాగదేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం గణపతి విగ్రహ ప్రతిష్ఠ, నాగదేవత, యంత్ర స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ, కల్యాణం, బలిహరణం, అశ్వర్థ నారాయణ కల్యాణం, పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను పండితులు గరుడాగ్రి రామసుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు జనార్ధన్ శెట్టి, భాస్కర్ శెట్టి తదితరుల పర్యవేక్షించారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను అడ్డుకుంటాం

హొళగుంద: ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్‌గా కొనసాగించాలనే డిమాండ్‌ను పట్టించుకోకుండా కొత్తగ ఏర్పాటు చేసిన, పాత స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లతో ఈ నెల 15వ తేదీన నిర్వహించే సమావేశాలను అడ్డుకుంటామని ఇంగళదహాళ్, మడ్డిలింగదహళ్లి , పెద్దగోనెహాళ్ గ్రామ పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు, గ్రామపెద్దలు, యువకులు హెచ్చరించారు. గురువారం ఇంగళదహాళ్‌లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రమిదావతమ్మ, సుధాకర్, వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్లు ఉరుకుందు, కొండయ్య, సునీత, యూత్ సభ్యులు శేఖర్, బోడి, రాజు, రఫీ, మహనంది తదితరులు సమావేశమై చర్చించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

పత్తికొండ రూరల్ : మండలంలోని పెండ్లిమాన్ తండాలో గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ సాయిప్రవీణ్ ఆధ్వర్యంలో సిబ్బందితో దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి నిల్వ ఉంచిన 450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వారి సర్టిఫికెట్లు రద్దు చేయాలి

దేవనకొండ: క్రైస్తవ మతంలోకి మారిన వారి ఎస్సీ సర్టిఫికెట్లను రద్దు చేయాలని దేవనకొండ ఎస్సీ కాలనీవాసులు వీరభద్ర, ముత్యాల రాముడు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మతం మారినప్పుడు ఎస్సీ కులానికి చెందిన వారు ఎలా అవుతారని ప్రశ్నించారు. వీరి వల్ల అసలైన హిందూ ఎస్సీ వర్గానికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవులుగా మారి ఎస్సీలకు రావాల్సిన ప్రయోజనాలన్నీ వారు పొందడం అన్యాయమన్నారు.

18న ముత్తుకూరులో దేవర

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో ఈనెల 18,19వ తేదీన బంగారమ్మ, పెద్దమ్మవ్వ ఊరి దేవర నిర్వహించున్నుట్లు సర్పంచ్ తోయజాక్షప్ప గురువారం తెలిపారు. 18న బంగారమ్మ, పెద్దమ్మవ్వ ఆలయాల్లో గంగ, ఆకుపూజ, మంగళహారతులు, 19న అమ్మవార్లకు కుంభాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మద్దికెర : పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

రుణాల దరఖాస్తు గడువు పెంపు

హాలహర్వి: బీసీ రుణాల దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 15వ తేదీ వరకు పొడిగించిందని ఎంపీడీఓ వరలక్ష్మి గురువారం తెలిపారు. అవకాశాన్ని అర్హులైన బీసీ, ఈబీసీ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ లేదా సచివాలయాల ద్వారా దరఖాస్తులు పూర్తి చేసి పంపించాల్సి ఉంటుందని చెప్పారు.

ఎల్లార్తి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు

హొళగుంద: ఎల్లార్తిలోని షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం సందర్భంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయి బాబా ఆలయాలను దర్శించుకున్నారు.

16 నుంచి కొత్తపేటలో మస్తాన్‌వలి ఉరుసు

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామంలో మస్తాన్‌వలి స్వామి ఉరుసు ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు ముజావర్ రహిమాన్‌సాహెబ్ గురువారం తెలిపారు. 16న గంధం, 17న ఉరుసు, 18న జియారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

హొళగుంద: గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎల్లార్తి సర్పంచ్ కురువ చాముండేశ్వరి తెలిపారు. గురువారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్య తీర్చేందుకు గాను కొత్త పైప్‌లైన్ పనులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి మాట్లాడుతూ.. వేసవి కాలం ప్రారంభమవడంతో తాగునీరు సరిపోక కాలనీ వాసులు ఇబ్బందులు పడకూడదనే పైప్‌లైన్ వేయిస్తున్నట్లు చెప్పారు.

బండలాగుడు పోటీల్లో రాయవరం ఎద్దుల జయకేతనం

- ముగిసిన లాలుస్వామి ఉరుసు



బండలాగుతున్న వృషభాలు



బహుమతి అందిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామంలో మూడు రోజులుగా జరిగిన శ్రీతాత లాలుస్వామి ఉరుసు గురువారం కిస్తీతో ముగిశాయి. చివరి రోజు లాలుస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాలపళ్ల వృషభాల అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీల్లో తెలంగాణ రాష్ట్రం, నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలం, రాయవరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు మొదటిస్థానంలో నిలిచినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.రెండవ స్థానంలో నంద్యాల జిల్లా, పాణ్యం మండలం, పిన్నాపురం గ్రామానికి చెందిన బిజ్జమ్మగారి వెంకటకృష్ణయ్య వృషభాలు నిలిచాయి. మూడవ స్థానంలో బి.తాండ్రపాడుకు చెందిన చిన్న రత్నం వృషభాలు, నాల్గవ స్థానంలో వైఎస్సార్ జిల్లా, జమ్ములమడుగుకు మారంరెడ్డి మహేశ్వరెడ్డి ఎద్దులు, ఐదవస్థానంలో ప్రకాశం జిల్లా, అర్ధవీడు మండలం, నారాయణపల్లి, నంద్యాల జిల్లా, మిడుతూరుకు చెందిన వృషభాలు ఉమ్మడిగా నిలిచాయన్నారు. వారికి రూ, 50వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5 వేలను అందజేశారు. ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మొదలైన భగభగలు

- ముందుగానే వేసవి ప్రారంభం
- వారం వ్యవధిలో 26 నుంచి 37 డిగ్రీలకు పెరిగిన ఉష్ణోగ్రత
- తగ్గిన చలి ప్రభావం



ఆలూరు రూరల్: సాధారణంగా శివరాత్రి వరకు చలికాలం ఉంటుంది. ఆ తరువాత ఎండలు ముదురుతాయి. అయితే ఇందుకు భిన్నంగా ఈ ఏడాది ఫిబ్రవరి ప్రారంభం నుంచే ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభించాయి. పది రోజులకు పైగా చలి ప్రభావం పూర్తిగా తగ్గింది. ఇదే సమయంలో పగటి పూట ఎండ తీవ్రత పెరిగింది. వారం క్రితం పగటి ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల సెల్సియస్ ఉండగా గురువారం 36.6 డిగ్రీలకు చేరడం ఆందోళన కలిగిస్తోంది. బుధవారం దేశం మొత్తం మీద అధిక ఉష్ణోగ్రత 37.8 డిగ్రీలు కర్నూలులోనే నమోదవడం విశేషం. ప్రారంభంలోనే దాదాపు 40 డిగ్రీలకు చేరువలో ఉండటంతో ఏప్రిల్, మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాధారణానికి భిన్నంగా దాదాపు 8 నుంచి 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఇక వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో అప్పుడే పుచ్చకాయలు, చెరకు రసం, కొబ్బరిబోండాలు, నిమ్మరసం తదితర చల్లని ద్రవ పదార్థాల విక్రయాలు వేగం పుంజుకున్నాయి. కాగా..ఎండ అధికంగా ఉన్న సమయంలో బయట తిరగరాదని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చంటిబిడ్డలు, బాలింతలు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. ఒకవేళ వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే ఎండనుంచి రక్షించే జాగ్రత్తలు తీసుకోవాలని, నీటిని అధికంగా తీసుకోవాలని చెబుతున్నారు.



ఆలూరులో పుచ్చకాయల విక్రయాలు మొదలు

ముగిసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

- హుండీ ఆదాయం రూ.3.34 లక్షలు



ఉత్సవమూర్తికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



గజవాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో కొలువైన శ్రీ కొలుట్ల చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభమై గురువారం చక్రస్నానం, వసంతోత్సవంతో ముగిశాయి. స్వామివారి చక్రస్నానం, వసంతోత్సవం కార్యక్రమాలు పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. స్వామి వారి ఉత్సమూర్తి గజవాహనంపై భక్తులను ఆశీర్వదించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు, దర్శన టికెట్ల రూపంలో మొత్తం రూ.3.34 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ వీరయ్య తెలిపారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్ అమలును విరమించుకోవాలి

ఆలూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ అమలును విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు డిమాండ్ చేశారు. ఆలూరులో గురువారం ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ నూతన కమిటీ ఎన్నిక సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ ఏఐటీయూసీ నూతన అధ్యక్ష, కార్యదర్శిగా కృష్ణమూర్తి,రంగన్నతో పాటు మరో 10 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, మండల కార్యదర్శి రామాంజినేయులు ఉన్నారు.

కూటమి పాలనలో కక్ష సాధింపు చర్యలు

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ నేత వల్లభనేని వంశీపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడాన్ని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందన్నారు. సత్యవర్ధన్ కేసు వాపసు తీసుకున్నాడని, ఉద్దేశపూర్వకంగానే కిడ్నాప్ కేసు పెట్టి వంశీని అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. చట్టానికి వ్యతిరేకంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది వారందరికీ చట్టపరంగానే సమాధానం చెబుతామని హెచ్చరించారు. అధికారం ఉందని మిడిసిపడటం మంచి కాదని హితవు పలికారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారని పేర్కొన్నారు.

విభిన్నం..

ప్రకృతిలో వివిధ విభిన్నతలు వాటి ప్రత్యేకతను చాటతాయి. అందులో భాగంగానే.. రాతన ఆశ్రమ పాఠశాల సమీపంలో ఓ చింత చెట్టు చూపరులను ఆకర్షిస్తోంది. చెట్టు ఓ వైపు ఆకులు ఎండిపోయి కనిపిస్తుంటే, మరో వైపు పచ్చని ఆకులతో కళకళలాడుతోంది. రెండు వర్ణాలతో దర్శనమిస్తున్న చెట్టు ఆ మార్గం గుండా వెళ్లే చూపరులను ఆకట్టుకుంటోంది. – తుగ్గలి



రాతన వద్ద ఓ వైపు ఎండి, మరో వైపు ఆకుపచ్చగా ఉన్న చింత చెట్టు

రామతీర్థానికి కొత్త శోభ

- కాశీ నుంచి జ్యోతిర్లింగాలు, అమరనాథ్ విగ్రహాలు
- గాయత్రీమాతకు నూతన రథం
- ఈనెల 15నుంచి 17వ తేదీ వరకు గాయత్రీ మాత ఆరాధనోత్సవాలు





ప్రతిష్ఠాపనకు కాశీ క్షేత్రం నుంచి తెప్పించిన జ్యోతిర్లింగాలు, అమరనాథ్ లింగం



రామలింగేశ్వరస్వామి



గాయత్రీమాత, ఇతర విగ్రహాల ప్రతిష్ఠాపనకు నిర్మించిన మండపాలు

ఆస్పరి: రాముడు అడుగిడిన పవిత్ర పుణ్య క్షేత్రం రామతీర్థం. ఈ క్షేత్రంలో వెలసిన రామలింగేశ్వరస్వామి, గాయత్రీమాత ఆలయాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. భక్తులు, దాతలు సహకారంతో క్షేత్రంలో రూ. 40 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయి. కొత్తగా కాశీ నుంచి తెప్పించిన 12 జ్యోతిర్లింగాలు, అమరనాథ లింగం, పార్వతీదేవి, వినాయక విగ్రహాలు, నంది, ధ్వజ స్తంభం, కలశాలు, అభ యాంజనేయస్వామి, రూ.12 లక్షలతో కొత్త రథం, విగ్రహాల ప్రతిష్ఠాపనకు మండపాలు నిర్మించారు.

15నుంచి ఆరాధనోత్సవాలు..

ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు గాయత్రీమాత ఆరాధనోత్సవాలు నిర్వహించునున్నట్లు ఆలయ నిర్వాహకుడు రూపామోహన్‌శర్మ తెలిపారు.15న గాయత్రీమాత ఆలయంలో వేదపండితులు అనిల్ కుమార్ శర్మ, రామసుబ్బయ్య శాస్త్రి, సురేంద్ర శర్మ ఆధ్వర్యంలో గంగ, గణపతి, గోపూజ, పుణ్యాహవచనం, గణపతి హోమం, మంగళహారతులు తదితర పూజలు చేపట్టనున్నారు. 16న ప్రాతఃకాలపూజ, మూలమంత్ర జపం, రుద్ర, పవమాన హోమం, గ్రామోత్సవం జరిపిస్తారు. రాత్రి వేమారెడ్డి మల్లప్ప కథ నాటకం ఏర్పాటు చేశారు. 17న యంత్ర ప్రతిష్ఠ, జ్యోతిర్లింగాలు, అమరనాథ లింగం,బసవన్న, అభయాంజనేయస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించునున్నట్లు నిర్వాహకులు వివరించారు. చివరి రోజు రాత్రి పంచమాంకములు నాటక ప్రదర్శన.

ఆ పేరు ఎలా వచ్చిందంటే..

త్రేతాయుగంలో రాముడు అరణ్యవాసం చేస్తున్న సమయంలో ఈ ప్రాంతంలో ఒక్క రోజు నిద్రించి, ఉదయం శివలింగాన్ని ప్రతిష్ఠించి ఒక కొలను నిర్మించాడని స్థానిక చరిత్ర. రాముడు నడయాడిన ప్రాంతం కావడంతో రామతీర్థంగా పేరుగాంచింది.

దినదినాభివృద్ధి చెందుతోంది

మా గ్రామ పరిధిలో ఉన్న రామతీర్థం క్షేత్రం అభివృద్ధికి దాతలు, భక్తులు ముందుకు వస్తున్నారు. ఒకే సారి 12 జ్యోతిర్లింగాలు, అమరనాథలింగం ప్రతిష్ఠాపన, కొత్త రథం చేయించడం సంతోషం. రామతీర్థంలో వెలసిన గాయత్రీమాత విగ్రహం కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కూడా లేదని పండితులు పేర్కొంటున్నారు. మూడు రోజులు పాటు జరిగే ఆరాధనోత్సవాలు, విగ్రహాల ప్రతిష్ఠాపనకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– విజయలక్ష్మి సర్పంచ్ శంకరబండ గ్రామం